
Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(2), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

# పృథు చక్రవర్తి వృత్తాంతము – వ్యక్తిత్వ వికాస భావనలు

**డా. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్**
తెలుగు లెక్చరర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, పామర్రు, కృష్ణాజిల్లా

పోతన భాగవతం మోక్షమార్గోపదేశ గ్రంథం. పన్నెండు స్కంధాల సుదీర్ఘ భక్తితత్వ ప్రబోధాత్మకమైన పురాణరాజమైనప్పటికీ, అడుగడుగునా వ్యక్తిత్వ వికాసపు ఛాయలే గోచరిస్తాయి. ఆలోచింపజేస్తాయి. పరివర్తన తెస్తాయి. ఎంతటివారినైనా పరిపూర్ణునిగా చేస్తాయి. సమాజ హితమే సాహిత్యపు సమున్నత ఆశయంగా సాగిన వందలాది గ్రంథాల్లో భాగవత స్థానం ఉత్కృష్టమైనది. భాగవతం నాల్గవ స్కంధంలోని "పృథుచక్రవర్తి" వృత్తాంతం ద్వారా ఇదే విషయం నిరూపితమౌతుంది. **"భూవర! యోగ తపోమఖంబుల చేత గైకొని సులభుండ గాని యేను సమచిత్తులైన సజ్జనుల చిత్తంబుల వర్తించుచుండెడి వాఁడ"**[1] (IV-544) నని సాక్షాత్తూ విష్ణు భగవానుని చేత పృథుచక్రవర్తితో పలికించడం లాంటివి చాలానే కన్పిస్తాయి. పృథువులోని శమశీలాలకు అసూయారాహిత్యపు పరిణతికి, సంస్తుతులకు వశుడై అనుగ్రహించి, వరాలిచ్చినట్లుగా వరాన్ని శ్రీహరి చేత ప్రకటింపజేయడం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తుంది. స్థూలంగా చెప్పాలంటే పృథు చక్రవర్తి వృత్తాంతమంతా వ్యక్తిత్వ నిర్మాణానికి, మనోవికాసానికి తోడ్పడే విధంగానే సాగింది. దీనికితోడు ఒక చక్కని వివేకవంతమైన జీవన విధానాన్ని చాటి చెప్తుంది.

పృథుమహారాజుని వంది మాగధులూ, సూతులూ పొగడుతూ కీర్తిస్తున్నప్పుడు **"నాయందు గమనీయ గుణములు గలిగెనేని యర్థంబు నూతి సేయ; నవి లేవు నాయందు నదిగాన మేనుతి వ్యర్థమయ్యె"**[2] (IV-445) అని వినమ్రంగా సూచించడం వ్యక్తిగా, ప్రజలను పాలించే రాజుగా ఎంతటి విజ్ఞతను కల్గి ఉండాలో తెలియజేస్తుంది. కష్టసాధ్యమైన శ్రీహరి అనంత సుగుణాలను స్తుతించవచ్చునీ, అంతేకానీ మహాత్ములని పొగిడినట్లుగా తనను పొగడటం తగదని పృథు చక్రవర్తి ద్వారా ప్రకటింపబడింది. అతివిశ్రుతులు నిర్మలమైన మనోవికాసంలో ఉంటారనీ, అలాంటి **"మహోదారులధిక నిర్మలు లాత్మస్తుతి, పరనిందలు దోషము, లతి హేయములని తలంతురాత్మలెపుడున్"**[3] (IV-447) అంటూ చాటిచెప్పడం కూడా ఇదే విషయాన్ని గుర్తు చేస్తుంది. గొప్ప కార్యాలు సాధించక ముందే రాజుని పసిపిల్లల్లా పొగడటం సముచితం కాదని విదితమౌతుంది.

పృథు చక్రవర్తి తలపెట్టిన శతశ్వమేధ దీక్షను భగ్నం చేయాలని ప్రయత్నించి భంగపడిన దేవేంద్రుణ్ణి శ్రీహరి హితవు మేరకు క్షమించి, గౌరవించడం కూడా క్షమాగుణం గొప్పదనాన్ని తెలియజేస్తుంది. ఈ సందర్భంగా

---

1. *పోతన భాగవతము – నాల్గవ స్కంధం – 544 పద్యం – పుట 136.*
2. *పోతన భాగవతము – నాల్గవ స్కంధం – 445 పద్యం – పుట 113.*
3. *పోతన భాగవతము – నాల్గవ స్కంధం – 447 పద్యం – పుట 114.*

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(2), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

శ్రీహరి పృథువుతో సత్పురుషుడైన వానికుండాల్సిన గుణగణాలను ప్రస్తావించడం ద్వారా ఉన్నత మనస్కునికి ఆలోచనాధోరణి ఎలా ఉండాలో స్పష్టం చేయబడింది. **"సత్పురుషులగువారు దేహాభిమానం గాకుండుటం జేసి, భూతంబు లయెడ ద్రోహం బాచరింప"**[4] (IV-540 వచనం) రని శ్రీమహావిష్ణువుచేతనే పలికింపజేయడం ఏ కాలంలోని వారికైనా ఆదర్శప్రాయంగా, అనుసరణీయంగా భాసిల్లుతుంది. పరులకు హాని చేస్తే "దీర్ఘతరంబైన వృద్ధ జన సేవ వ్యర్థంబుగాదె!" అని పేర్కొనడం ద్వారా రెండు విషయాలు తేటతెల్లం చేయబడ్డాయి. వృద్ధులను ఆదరించి, సేవించడం గొప్ప కార్యమనీ, పరహాని మేలు కాదని స్ఫురిస్తుంది.

**"శరీరంబవిద్యాకామంబులు చేత నారబ్ధంబని"** తెలిసినవాడే పరమ జ్ఞాని అని పేర్కొనడం పైకి తాత్వికంగానే కనిపిస్తుంది.[5] (IV-540) నిజానికి దేహాభిమానం అతిగా ఉండరాదనీ, ఆ భావన హృదయంలో మొలకెత్తినప్పుడే అసూయ, స్వార్థాలు దరిచేరవనే సత్యాన్ని తెలియజేస్తుంది. స్వధర్మాచరణతో నిష్కాముడై శ్రద్ధతో సేవించేవారి మనస్సు నిర్మలమౌతుందనే, అలాంటి వారే తుదకు మోక్షాన్ని సైతం అందుకోగలరనే దివ్య సందేశం కూడా ప్రకటితమవుతుంది. అలాంటి జీవనవిధానంలోనే ప్రశాంతత నెలకొంటుందనీ, మనిషిగా సుఖదుఃఖాలను సమంగా చూడగలిగే స్థితప్రజ్ఞత సాధింపబడుతుందని చెప్పబడింది. **ఉత్తమ, మధ్యమ, అధమ విషయాలలో సమానుడిగా వ్యవహరించే వ్యక్తి ఇంద్రియాలను జయించగలడనీ, అప్పుడే సమస్త ప్రజలకు సమదృష్టితో పాలించి, రక్షించగలడని వెల్లడించబడింది.**

పృథువు వృత్తాంతం పోతనగారి భాగవతంతో పాటు ఇతర ప్రముఖ గ్రంథాలైన మహాభారతం, విష్ణుపురాణం, పద్మపురాణం మొదలగువాటిలో కూడా వర్ణింపబడింది. వాటిలో కూడా పృథువు ఆదర్శమైన పరిపాలకుడిగా, ఆత్మజ్ఞానిగానే కనిపిస్తాడు. అథర్వణవేదం ప్రకారం గోమాత రూపంలో పారిపోతున్న భూమిని వెంబడించి, ఒప్పించి, ఎగుడుదిగుడుగా ఉన్న భూ ఉపరితలాన్ని చదునుచేసి, ఎంతో ఉపయోగకరమైన, ఎన్నో రకాల ఔషధీయ, సంప్రదాయ వృక్షజాతులను మానవాళికి అందుబాటులో తెచ్చిన మహానుభావుడు పృథువు. క్రమంగా వ్యవసాయం, పశుపోషణ, నాగరికతలకు దారి చూపిన దైవాంశ సంభూతుడు పృథువు. ఇంతటి గొప్ప బాధ్యతాయుతమైన రాజధర్మాన్ని నెరవేర్చిన పృథువు జీవిత చరమాంకంలో తన భార్య అర్చితో కలసి, అడవుల్లో తపస్సు చేసుకుంటూ శేషజీవితాన్ని గడిపాడు. ఈ రాజభోగాలూ, సిరిసంపదలు అశాశ్వతమని తెలియజెప్పిన మనోవికాసం గల ఆత్మజ్ఞానిగా పృథువు కనిపిస్తాడు.

పృథువు తొంబయితొమ్మిది యజ్ఞాలను ఫలవంతంగా నిర్వహించి, నూరవ యజ్ఞాన్ని ప్రతిష్టాత్మకంగా పూర్తిచేయదలచినా, ఇంద్రుడి కారణంగా నూరవ యజ్ఞం అసంపూర్తిగా నిలిచిపోయినప్పుడు కొంత కోపోద్రిక్తుడౌతాడు. కానీ బ్రహ్మదేవుని మాట ప్రకారం ఇంద్రుణ్ణి మన్నిస్తాడు. ఇంద్రుడిని క్షమించడం సబబేనని సత్పురుషులకు దేహాభిమానం ఉండరాదని, అలా పరుల దోషములను క్షమించకుండా, బాధ కల్గించినట్లయితే

*4. పోతన భాగవతము – నాల్గవ స్కంధం – 540 పద్యం – పుట 135.*

*5. పోతన భాగవతము – నాల్గవ స్కంధం – 540 పద్యం – పుట 135.*

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(2), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

చాలాకాలం నుంచి చేసిన వృద్ధజనసేవ వ్యర్థమౌతుందని బ్రహ్మదేవుడు హితవు పలుకుతాడు. **"ప్రాప్తంబులైన యావత్సంపదల యందు మత్సరులైన మహాత్ములు వికారంబు నొందరు, గావున నీవు సుఖదుఃఖంబుల యందు సమచిత్తుండవును"**[6] (IV-540) అని పృథువుకు సూచించడం ద్వారా మానవుడు ఎంతటివాడైనా సుఖదుఃఖాలను రెంటినీ సమంగా భావించగల ఇంద్రియనిగ్రహం పెంపొందించుకోవాలని తెలుస్తుంది. ఇంద్రుణ్ణి మన్నించి ఆదరించిన తర్వాతనే విష్ణువు కూడ పృథువు చేసిన పూజాధికాలను గ్రహించి, సంతృప్తినొంది, శుభాశీస్సులను ప్రసాదిస్తాడు.

పృథువృత్తాంతం సందర్భంగా శ్రీమహావిష్ణువు ద్వారా ప్రకటింపబడిన ఈ పాలనా నియమాలలో పరోక్షంగా ప్రతి వ్యక్తి ఆచరించి చూపాల్సిన జీవన నైపుణ్యాలు ప్రస్ఫుటమౌతాయి. **"పార్థివోత్తములకు ప్రజల రక్షించుట పరమధర్మంబగు నరవరేణ్యా"**[7] (IV-541) అని ప్రబోధించడంలోని ఆంతర్యం కూడా ఇలాంటిదే ప్రజల పుణ్యాలలో ఆరోవంతు పాలకునికే చెందుదుందని) సమచిత్తుండవై పరిపాలించమని హితవు పలకడంలో పరోక్షంగా ప్రజా క్షేమమే పాలకులకు అన్నివిధాల మేలనే సూచన ప్రస్ఫుటమౌతుంది.

'పృథువృత్తాంతం'లో పోతన వెల్లడించిన ఈ విష్ణు సందేశం చాలా సంక్షిప్తమైనదే అయినా (ఇలాంటివి భాగవతంలో కోకొల్లలుగా కనిపిస్తాయి) అందులోని సారాంశం, సందేశాలరీత్యా ఎంతో మహత్తరమైనది. మనిషిని మనిషిగా తీర్చిదిద్దగల భావసౌందర్యం తదనుగుణమైన వ్యక్తిత్వ వికాసం పెంపొందేందుకు దోహదం చేస్తాయి. అందుకే భాగవతంలోని పృథువృత్తాంతంలో సామాజిక బాధ్యతతో కూడిన జీవనశైలి, విశాల దృక్పథంతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం ఉంది. స్థితప్రజ్ఞతతో కూడిన కార్యదక్షత ఉంది. అంతిమంగా పరోపకారమే పుణ్యం, పరపీడనం మహాపాపమనే మానవీయ భావనలతో వైయక్తిక వివేకం మరియు విజ్ఞతలతోనూ కూడిన పరమసత్యము ప్రకటితమౌతుంది. వ్యక్తియొక్క సంపూర్ణ వికాసం జరిగేందుకు ఆవశ్యకమైన అన్ని విషయాలు సోదాహరణంగా దర్శనమిస్తాయి.

– – –

---

*6. పోతన భాగవతము – నాల్గవ స్కంధం – 540 పద్యం – పుట 135.*

*7. పోతన భాగవతము – నాల్గవ స్కంధం – 541 పద్యం – పుట 136.*